'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

డెంగీ విజృంభణ

వర్షాకాలంలో పారిశుద్ధ్య సమస్య, దోమల బెడద అనేవి ఏటా వేధిస్తూనే ఉంటాయి. ఇవి అంతిమంగా నీజనల్ వ్యాధుల వ్యాప్తికి దారి తీస్తాయి. సకాలంలో ప్రభుత్వం నివారణ చర్యలు చేపడితే వీటిని అదుపులో ఉంచవచ్చు. కానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతల్లో అలాంటివేమీ ఉన్నట్టు కనిపించడం లేదు. రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగీ జ్వరాలే ఇందుకు నిదర్శనం. డెంగీ వ్యాప్తిపై విడుదలైన తాజా గణాంకాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. జూలై 1 నుంచి ఆగస్టు 18 మధ్యకాలంలో రాష్ట్రంలో మూడువేలకు పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. అదే సమయంలో దేశంలో 32 వేల కేసులు నమోదయ్యాయి. అంటే జాతీయ స్థాయితో పోలిస్తే రాష్ట్రంలో కేసులు పదిశాతం మేర ఉంటాయన్న మాట. అందులో అత్యధిక కేసులు గ్రేటర్ హైదరాబాద్‌లో నమోదైనవే. డెంగీతో పాటు ఇతర నీజనల్ వ్యాధులూ వ్యాపిస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. కనీసం ఇంటికొకరు ఈ రోగాల బారిన పడుతున్నారు. ఫలితంగా సర్కారు దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయి. వైద్యపరీక్షల కిట్ల కొరత కారణంగా బాధితులను ప్రైవేటు కేంద్రాలకు పంపిస్తున్నారు.

భారత్‌లో డెంగీ వ్యాప్తి అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. ముందస్తు హెచ్చరికల జారీ, దోమల నివారణకు చర్యలు చేపట్టడంలో వైఫల్యమే దీనికి కారణమని తెలిపింది. రెండు మాసాల క్రితం సగటు కేసులు తగ్గినట్టు కనిపించినప్పటికీ గత ఐదారు వారాల్లో ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. ఇది ప్రభుత్వ నిర్వహణ లోపాలవైపు వేలెత్తి చూపిస్తున్నది. సాధారణంగా వర్షాకాలానికి ముందే ప్రభుత్వం నీజనల్ వ్యాధులను ఎదుర్కోవడంపై దృష్టిపెట్టాలి. సంబంధిత మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షలు జరపాలి. వైద్యాధికారులను అప్రమత్తం చేయాలి. దోమల నివారణకు చేపట్టిన చర్యలపై దృష్టిసారించాలి. మందులను సిద్ధం చేయాలి. కానీ, ప్రభుత్వం చురుగ్గా స్పందించిన దాఖలాలేవీ కనిపించడం లేదు. కేవలం తూతూమంత్రం సమావేశాలతో, మొక్కుబడి చర్యలతో సరిపెట్టిందనే ఆరోపణలు వస్తున్నాయి.

స్వరాష్ట్ర సాధన తర్వాత ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నిరంగాలతో పాటు ప్రజారోగ్య రంగాన్ని పటిష్ఠం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి వంటి కార్యక్రమాల ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ట్రాక్టర్లను సమకూర్చారు. గ్రామ పంచాయతీలకు, పురపాలికలకూ నెలనెలా క్రమం తప్పకుండా నిధులు అందజేశారు. అన్నిస్థాయుల్లో ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేశారు. గ్రామీణ వైద్య వ్యవస్థను మెరుగుపర్చి ప్రజలకు భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానలు నెలకొల్పారు. ఎక్కడికక్కడ వైద్యపరీక్ష సౌకర్యాలూ ఏర్పాటు చేశారు. ఇలా కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం చేసి అందించిన ఉత్తమస్థాయి వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్ సర్కారు దారుణంగా విఫలమైంది. రాష్ట్రాన్ని ప్రజారోగ్య సంక్షోభంలోకి నెట్టివేసింది. ప్రస్తుత పరిస్థితికి పారిశుద్ధ్య నిర్వహణాలోపం, ప్రజారోగ్య విభాగం సన్నద్ధతాలోపం.. రెండూ కారణమేనని చెప్పాలి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని నష్టనివారణ చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, దోమల నివారణ, దవాఖానల బలోపేతానికి తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు కూడా దోమలవ్యాప్తిని అరికట్టడంలో తమ వంతు తోడ్పాటు అందించడమూ ముఖ్యమే.

కాంగ్రెస్‌కు పటేల్ విగ్రహ పాఠాలు

టంకశాల అశోక్

తెలంగాణ సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన విషయమై కాంగ్రెస్ వైఖరిని గమనించినప్పుడు అనేక విషయాలు మనసుకు వస్తాయి. ఇటీవలి పరిణామాల నుంచి ఒక ఉదంతాన్ని చెప్పుకొని, ఇతర అంశాల చర్చలోకి తర్వాత వెళదాం. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ 2014లో ఓడి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 600 అడుగుల సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహాన్ని 2018లో గుజరాత్‌లో ప్రతిష్ఠించారు. 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' పేరిట నర్మదా నదీ తీరాన గల ఆ విగ్రహం మొత్తం ప్రపంచంలోనే అన్ని విగ్రహాల కన్నా ఎత్తయినది. అందుకు ఖర్చు రూ.2989 కోట్లు. పటేల్‌కు ఉక్కు మనిషి అని, వలస పాలన తర్వాత దేశంలోని సంస్థానాలన్నింటినీ విలీనం చేయడంతో పాటు మొత్తం దేశం కోసం ఒక పాలనాయంత్రాంగాన్ని నెలకొల్పినవాడనే ప్రతిష్ఠ ఉంది. ఆ విధంగా తన విగ్రహం 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' అయింది. కాంగ్రెస్ వారికి ఇదంతా తెలుసు. అయినప్పటికీ ఆయన విగ్రహం ఏర్పాటును అప్పుడు రకరకాల పేర్లతో నానాయాగీ చేశారు. దానితో దేశప్రజల దృష్టిలో ప్రతిష్ఠ కాస్తా బీజేపీకి లభించగా, కాంగ్రెస్ అప్రతిష్టపాలైంది.



ఇప్పుడు మరొకటి చెప్పుకుందాం. సర్దార్ పటేల్ జీవిత చరిత్రను సాధికారికంగా రచించిన చరిత్రకారుడు రాజ్‌మోహన్‌గాంధీ. ఆ గ్రంథం ఉపోద్ఘాతంలో ఈ విధంగా ఉంది. 'స్వతంత్ర భారతదేశ వ్యవస్థ ఒక చట్టబద్ధతను, శక్తి సంపన్నతను సమకూర్చుకోవటానికి ప్రధానంగా ముగ్గురు వ్యక్తులు చేసిన కృషి కారణమనాలి. వారు గాంధీ, నెహ్రూ, పటేల్. కానీ, ఆ గుర్తింపు నెహ్రూకు పూర్తిగా లభించి, గాంధీ విషయంలో భక్తిశ్రద్ధలతో జరగగా, పటేల్‌ను ఎవరూ ఎక్కువగా పట్టించుకోలేదు. 1989లో నెహ్రూ జన్మదిన శత వార్షికోత్సవాల సందర్భంగా వెయ్యి బిల్‌బోర్డులు వెలిశాయి. ఆయనకు స్మారకంగా టెలివిజన్ సీరియళ్లు ప్రసారమయ్యాయి. అనేకానేక ఇతర ఉత్సవాలు, కార్యక్రమాలు జరిగాయి. 1975 అక్టోబర్ 31న పటేల్ శత వార్షికోత్సవ సమయంలో, ఇందుకు పూర్తి భిన్నంగా, మనకేమీ కనిపించలేదు. ఆ తర్వాత కూడా, ఆధునిక భారతపు అద్భుత సుపుత్రులలో ఒకరి జీవితంపై కప్పిన తెరలను అప్పుడప్పుడు, పాక్షికంగా మాత్రమే తొలగదీశారు'.

పటేల్ విగ్రహ ఉదంతానికి, తెలంగాణ తల్లి విగ్రహ విషయానికి సంబంధం ఏమిటని అనిపించవచ్చు. ఆ సంబంధం ఏమిటో చూద్దాం. కొద్ది మాటల్లో చెప్పాలంటే, స్వాతంత్ర్యోద్యమ ఖ్యాతి యావత్తూ గాంధీతో పాటు నెహ్రూకు మాత్రమే లభించాలని, దానిని ఆధారంగా చేసుకుని ప్రభుత్వాధిపత్యానికి నెహ్రూను (ఆ తర్వాత ఆయన వారసులను మాత్రమే) అర్హులను చేయాలన్న ఆలోచనలో ఇందుకు మూలాలున్నాయి. దేశమంతటికీ నేటికీ ఆరాధనీయునిగా మారిన సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్యం వచ్చే సమయానికి జీవించిలేరు గాని, కనీసం తనకు లభించవలసిన ఖ్యాతి విషయంలోనూ వీలైనన్ని ఆటంకాలు సృష్టిస్తూ పోయారు. అదంతా కూడా నెహ్రూ, ఆయన వంశీకుల కోసం. అందుకే బోస్ అస్థికలశం దేశానికి స్వాతంత్ర్యం లభించిన 77 ఏండ్ల తర్వాత కూడా ఒక పరాయి దేశమైన జపాన్ రాజధాని టోక్యో సమీపాన రెంకోజీ ఆలయంలోనే ఉండిపోయింది. దానిని భారత ప్రభుత్వం కోరిన వెంటనే అప్పగించగలమని ఆలయ ప్రధాన పూజారి చాలాకాలం క్రితమే ప్రకటించినా కదలిక లేదు. తన మరణానికి సంబంధించిన రహస్య పత్రాలు భారత ప్రభుత్వం వద్ద ఇప్పటికీ రహస్యంగానే ఉన్నాయి.

పటేల్ విషయంలో గాని, నేతాజీ విషయంలో గాని ఇవన్నీ ఎవరి కోసం జరిగాయన్నది ప్రశ్న. దేశం కోసమా? లేక నెహ్రూ, ఆయన వారసుల కోసమా? ఇదంతా చేయడంలో ఎవరి భాగస్వామ్యం ఉందన్నది మరొక ప్రశ్న. నిర్మొహమాటంగా చెప్పుకోవాలంటే, స్వాతంత్ర్యోద్యమ ప్రతిష్టపై, అది తెచ్చిపెట్టిన అధికారంపై ఏకచ్ఛత్రాధిపత్యం ఆ వంశపు కోరికకాగా, ఆ వంశాన్ని ఆశ్రయించి, పొగుడుతూ, ఎప్పటికప్పుడు లాభపడుతూ, ఆ వంశానికి ఇంటాబయటా ఎదురులేకుండా చూడాలన్నది కాంగ్రెస్‌లోని ఆశ్రిత గణాల నిరంతర ప్రయత్నం. ఆ క్రమంలో వారు చేసిన అనేక అకృత్యాల జాబితా అంతా ఇక్కడ రాయలేం గాని, ఆ వంశపు అధికారానికి, స్వయంగా తమ అధికారానికి ఆటంకం కాగలవనుకునే ప్రాంతీయ భావనలను, ప్రాంతీయ శక్తులను, ప్రాంతీయ సంస్కృతులను, ప్రజల మనోభిప్రాయాలను నిర్లక్ష్యం చేయడం, అవమానించడం, తొక్కివేయడం ఒక తప్పనిసరి అవసరమని ఆ పార్టీ లేదా ఆ వంశపు అధినాయకులు, వారి ప్రాంతీయ తాబేదార్లు తలపోశారు. ఆ ప్రకారమే ఇన్ని దశాబ్దాలుగా వ్యవహరిస్తూ వస్తున్నారు.

సర్దార్ పటేల్‌ను, నేతాజీ బోస్‌ను చీకటి గదులలోకి తోసివేయజూడటం నుంచి మొదలుకొని, ఇప్పుడు తెలంగాణ తల్లి అనే ప్రజల ఆరాధ్య దేవత విగ్రహాన్ని సచివాలయం ఎదుట నుంచి గాయబ్ చేసి, తమ అధికార ప్రదాతల వంశస్తుడి విగ్రహాన్ని అక్కడ ప్రతిష్ఠించజూడటం వరకు అన్నీ కూడా ఒకే మూలం నుంచి పుట్టుకొచ్చిన అధికార తాబేదారీ చర్యలే. కానీ, ఆ మాట బయటకు ఒప్పుకోవడం కాస్త ఇబ్బందిగా అవుతుంది గనుక, అందుకు 'త్యాగాలు' అనే ముసుగు తొడిగి, ప్రచారాలు చేసి, ప్రజలను నమ్మించజూస్తారు. ప్రజలట్లా నమ్మితేనే తమ అధికార జూదం విజయవంతంగా సాగుతుంది గనుక. ఇందులో నెహ్రూకు సంబంధించినంత వరకు త్యాగాలు, అర్హతలు, సమర్థతలు, దార్శనికత విషయంలో ఎటువంటి సందేహాలు లేవు. కుమార్తె ఇందిరను ప్రమోట్ చేసిన బంధుప్రీతి వరకు, అట్లాగే పటేల్, బోస్‌ల స్మృతిని అంతగా బయటకు రానివ్వకపోవటం వరకు నిజమే. వ్యక్తిగత అర్హతల విషయంలో మాత్రం సందేహాలు లేవు. తన వల్ల పార్టీ బతికింది తప్ప, తన మనుగడ కోసం పార్టీని ఉపయోగించుకోవలసిన అగత్యం ఆయనకు ఏర్పడలేదు. అట్లాగే ఆయన ఫెడరల్ నీతికి కట్టుబడి ప్రాంతీయ భావనలను గౌరవించారు తప్ప వాటిని తొక్కివేయజూడలేదు. నెహ్రూ తర్వాత ఈ కోణాల నుంచి అన్నీ మారసాగాయి. ఇందిర, రాజీవ్‌ల హత్యలు తీవ్రంగా ఖండించవలసినవే గాని, పంజాబ్ రాజకీయాలు, స్వర్ణమందిరంపై దాడి, సిక్కుల మనోభావాల విషయంలో ఇందిర గాని, శ్రీలంక వ్యవహారంలో రాజీవ్ గాని మితిమీరిన జోక్యం చేసుకోని పక్షంలో ఆ దురంతాలు సంభవించేవి కావు. కచ్చితంగా చెప్పాలంటే వారిద్దరిది అటువంటి దురంతాలకు బలి కావడం తప్ప, దేశం కోసం త్యాగం కాదు.

దేశం కోసం స్వాతంత్ర్యోద్యమ కాలంలో, ఆ తర్వాతా సర్దార్ పటేల్ ఘనమైన కార్యాలు అనేకం చేసినా, ఆయన కన్నా నెహ్రూయే ప్రధానమంత్రి పదవికి తగిన నాయకుడని స్వయంగా గాంధీజీ నిర్ణయించడంలో ఎన్నో ఆలోచనలు ఉన్నాయి. అవి సరైనవే కూడా. ఆ వివరాలు ఇక్కడ అసందర్భం గాని, కొన్ని లోపాలు ఉన్నప్పటికీ నెహ్రూ మహా నాయకుడు. అయినప్పటికీ 1952 నాటి మొదటి ఎన్నిక గడిచి 1957లో రెండో ఎన్నికలు వచ్చేసరికే ఆయన పార్టీ పలు రాష్ట్రాల్లో పరాజయాలు ఎదుర్కోవడం మొదలైంది. అందులోనే, వైఫల్యాలను నిజాయితీగా అంగీకరిస్తూ.. ప్రజాభిప్రాయాలను గౌరవించి అందుకు తగినట్లు వ్యవహరించక తప్పదని ప్రకటించడంలో ఆయన ప్రజాస్వామికత, గొప్పదనం ఉన్నాయి. కానీ, తన వారసులకు ఇవేమీ లేకపోయాయి. వారు, వారి అనుచరులు తమ నాయకుల కోసం, వారి అధికారం కోసం, అట్లాగే వారిని ఆశ్రయించి తాము కూడా అధికారం సంపాదించుకునేందుకు అన్నింటినీ తొక్కివేయడం సాగించారు. పటేల్, సుభాష్ చంద్రబోస్‌ల స్మృతులను తొక్కివేయటం, ప్రజాస్వామ్యాన్ని తొక్కివేయడం, ఫెడరలిజాన్ని తొక్కివేయడం, ప్రాంతీయ ప్రజాభిప్రాయాలను, సంస్కృతులను తొక్కివేయడం వంటివన్నీ అందులో ఉన్నాయి. ప్రాంతీయ భావనలు, పార్టీలు వరుసగా పుట్టుకువచ్చి కాంగ్రెస్ పుట్టి ముంచింది అందువల్లనే. కనుకనే వారు ప్రతీసారి ఆ పార్టీల వద్ద దేబిరించవలసిన పరిస్థితులు క్రమంగా ఏర్పడ్డాయి. ఇటీవలి 2024 ఎన్నికలతో సహా.

> **సమస్య ఎక్కడున్నది? ఫ్రాన్స్‌లో బోర్బన్ రాజవంశం ఒకటుండేది. వారి వందల ఏండ్ల చరిత్రలోకి ఇక్కడ పోలేం గానీ, వారికి సంబంధించిన ఒక సామెత ఉంది. వారు తమ చరిత్రకు సంబంధించి ఏదీ మరిచిపోరు, ఏదీ నేర్చుకోరు (ఫర్‌గెట్ నథింగ్, లెర్న్ నథింగ్) అని. కాంగ్రెస్ విషయమై, అంతకన్నా ముఖ్యంగా నెహ్రూ-గాంధీ కుటుంబ విషయమై ఈ సామెత బాగా సరిపోతుంది. వారికి చరిత్ర పాఠాలు నేర్చుకునే లక్షణమే ఉంటే.. పటేల్, సుభాష్ చంద్ర బోస్‌ల స్మృతులను తొక్కివేసి, ఇంకా తొక్కివేస్తూనే ఉండేవారు కాదు.**

పటేల్ విగ్రహ ప్రతిష్ఠాపనను బీజేపీకి, ప్రధాని మోదీకి వదలడం గాక తామే ఆ పని చేసేవారు. నేతాజీ చితాభస్మ కలశాన్ని ఎన్నడో జపాన్ నుంచి తెప్పించేవారు. కానీ, ఆ పనులు చేయనిది ఎందుకు? వారికి అధికార లాలస తప్ప ప్రజాభిప్రాయాలను, సంస్కృతిని గౌరవించే సంస్కారం లేదు. ఇంత చేసినా చివరకు అధికారం చేజిక్కించుకోగలమనే భ్రమలు, దురహంకారం కూడా చాలా ఉన్నాయి. రాజీవ్ గాంధీ పేరిట హైదరాబాద్‌లో, తెలంగాణలో ఇప్పటికే తగినన్ని ఉన్నాయి. అయినా మరొక విగ్రహం కావాలంటే, ఒకటి కాకపోతే పది పెట్టుకోవచ్చు. కానీ, తెలంగాణ తల్లి విగ్రహం కోసమని కొంతకాలం కిందటే నిర్దిష్టంగా గుర్తించిన స్థలంలోనే ఆమెను తోసిరాజని మరీ ఆయన విగ్రహం నెలకొల్పడం అంత తప్పనిసరి అవసరమా? అధికార తాబేదారీకి ఒక పరిమితి అక్కరలేదా? పాఠాలు నేర్చుకుంటే వారే బాగుపడతారు. కాస్త ప్రశాంతంగా ఆలోచించే విజ్ఞులెవరూ వారిలో లేరా? పటేల్ విగ్రహ ప్రతిష్ఠాపన ఉదంతం నుంచి పాఠాలు నేర్చుకోరా?

చేతగాక రోత మాటలు

సంపత్ గడ్డం
78933 03516

అబద్ధాలు చెప్పడం, దుష్ప్రచారాలు చేయడంలో కాంగ్రెస్ నాయకులను, మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మించినవారు లేరు. అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు ఇప్పుడు వాటిని నెరవేర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. హామీలను అమలుచేయలేక కేసీఆర్‌పై విషం గక్కే కార్యక్రమాన్ని ముందటేసుకున్నారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి రోతపుట్టించేలా మాటలు మాట్లాడుతూ, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ అడుగడుగునా నిలదీస్తుండటంతో కాంగ్రెస్ సర్కార్ డైవర్షన్ రాజకీయాలకు తెరదీసింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిగత దూషణలకు దిగడం, సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ఈ కోవలోనివే. తన హోదాను మరిచి రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.

> **గతంలోనూ రేవంత్‌రెడ్డి ఇలా మాట్లాడటాన్ని మనం చాలాసార్లు చూశాం. దురదృష్టవశాత్తు గతంలో కాలుజారి కేసీఆర్ పడిపోతే.. అసెంబ్లీకి రాలేక ముఖం చాటేస్తున్నారంటూ హేళన చేశారు. ఇప్పుడు తాజాగా రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో చిన్నారుల ముందు మరోసారి జుగుప్సాకరంగా మాట్లాడారు.**

అధికారం కట్టబెట్టిన ప్రజలకు మంచి చేయకుండా ప్రతిపక్ష నేతలపై బురదజల్లే కార్యక్రమం ముందటేసుకోవడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ పాలకులు చేస్తున్న వ్యక్తిగత విమర్శల పట్ల ప్రజల్లో అసహనం మొదలైంది.

మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ప్రజల బతుకుల్లో మార్పులు తేవాల్సిందిపోయి... పేర్లు, చిహ్నాల మార్పుతో భవిష్యత్తు తరాలకు తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి గురించి తెల్వకుండా చేయాలని కుట్ర పన్నుతున్నది. మొన్నటి వరకు తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పాలకులు.. ఇప్పుడు ఏకంగా సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టే దుస్సాహసం చేస్తున్నారు. ఇవన్నీ తెలంగాణ సమాజాన్ని అవమానించడమే.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిపెట్టాలి. ఆరు గ్యారంటీలతో పాటు ఇచ్చిన ఇతర 400 హామీలను అమలు చేయాలి. కేసీఆర్‌పైనో, గత బీఆర్ఎస్ సర్కార్‌పైనో అభాండాలు వేస్తూ ఎంతో కాలం కాలయాపన చేయలేరు. ఈ విషయాన్ని పాలకులు గ్రహించాలి. రోత మాటలు, రెచ్చగొట్టే ప్రసంగాలు తెలంగాణ సమాజానికి మంచివి కావు.

కేసీఆర్ గుర్తులను చెరిపేస్తానని పదే పదే చెప్తున్న రేవంత్ రెడ్డి ఒక్క విషయాన్ని తెలుసుకోవాలి. కేసీఆర్ గుర్తులను చెరిపేయడమంటే.. తెలంగాణ అస్తిత్వాన్ని కాలరాయడమే. ఆత్మగౌరవం కోసం సబ్బండ వర్గాలు చేసిన పోరాటాన్ని చరిత్ర పుటల్లో నుంచి కనుమరుగు చేయడమే. తెలంగాణ అస్తిత్వానికి ముప్పు వాటిల్లిన ప్రస్తుత తరుణంలో మరోసారి తెలంగాణ సమాజం ముక్తకంఠంతో నినదించాల్సిన అవసరం ఉంది.



'దేశం మేలు కోసం' అని ప్రజలను మభ్యపెట్టి అకస్మాత్తుగా ప్రభుత్వాలు తీసుకొనే నిర్ణయాల వెనుక రాజకీయ దురుద్దేశమే దాగి ఉంటుంది. ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ, మోదీ పాలనలో పెద్ద నోట్ల రద్దు లాంటివి ఆ కోవకు చెందినవే. స్వీయ ప్రయోజనాల కోసం జన జీవితాలను అతలాకుతలం చేసిన నిర్ణయాలివి. ఈ మధ్య సీఎం రేవంత్ రెడ్డి పుర్రెలో పుట్టిన హైడ్రా ధ్వంసరచన కూడా అలాంటి బాపతే. హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూముల రక్షణ పేరిట మొదలైన ఈ సంస్థ దూకుడు వెనుక ఉన్న రాజకీయ కోణం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. ముందుగా చెరువు పరిధిలో ఉన్న కొన్ని కట్టడాలను కూల్చేసి శభాష్ అనిపించుకుని, మెల్లగా ప్రత్యర్థుల ఆస్తుల వైపు హైడ్రా రూటు మార్చింది.

హైడ్రా వెనుక రాజకీయ కుట్ర!

బి.నర్సన్
94401 28169

జన్వాడలో ప్రదీప్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌ను కూల్చివేసేందుకు రంగం సిద్ధమైంది. హైడ్రా కన్ను ప్రత్యేకంగా ఆ కట్టడంపై పడటానికి కారణం దాన్ని బీఆర్ఎస్ నేత కేటీఆర్ లీజుకు తీసుకోవడమేనని తెలుస్తోంది. ఆ ఫామ్ హౌజ్ తనది కానప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే దాన్ని దగ్గరుండి మరీ కూల్చివేయిస్తానని కేటీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ నేతలు కూడా ఇందుకు ముందుకు రావాలని ఆయన సవాల్ విసిరారు. ముందుజాగ్రత్తగా ప్రదీప్ రెడ్డి తన ఫామ్‌హౌజ్ కూల్చివేతపై స్టే కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం హైడ్రా కూల్చివేతలపై విస్మయం వ్యక్తం చేసింది. అంతేకాదు, ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించింది. ఒక శాఖ అనుమతి ఇస్తే మరొక శాఖ కూల్చివేస్తుందా? యజమాని వద్దనున్న డాక్యుమెంట్లు చూస్తున్నారా? నోటీసులు ఇస్తున్నారా? బఫర్ జోన్ మార్కింగ్ అయిందా? నీటిపారుదల శాఖ నోటిఫికేషన్ ఉందా? హైడ్రాను ఎలా ఏర్పాటు చేశారు? దాని చట్టబద్ధత ఏమిటి? ఏ నిబంధనలను పాటించి, ఏయే నిర్మాణాలను కూల్చారో వివరించాలంటూ తదుపరి విచారణను సెప్టెంబర్ 12కు వాయిదా వేసింది. ఇప్పటికైనా ఒకరు కోర్టు తలుపులు తట్టడం వల్ల హైడ్రా దూకుడుకు కళ్లెం పడే అవకాశం వచ్చింది.

కోర్టు ప్రశ్నల నేపథ్యంలో హైడ్రా ఏకపక్ష ధోరణిపై టీవీల్లో కథనాలు వెలువడుతున్నాయి. 'అన్ని అనుమతులతో కట్టిన అపార్ట్‌మెంట్‌ను ఎలాంటి నోటీసు లేకుండా కూలదోస్తే నా బతుకేం కావాలి?' అని ఓ రియల్టర్ పడుతున్న వేదనను ఓ చానల్ ప్రసారం చేసింది. 'గండిపేట సమీపంలో రెండు రోజుల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రెస్టారెంట్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. ఇప్పటికే రూ.20 లక్షల వరకు ఖర్చు చేశాం. ముందే సమాచారమిచ్చి ఉంటే.. ఏసీలు, ఫ్రిజ్ లాంటి విలువైన వస్తువులనైనా దక్కించుకొనేవాళ్లం' అని దాన్ని లీజుకు తీసుకున్న వ్యాపారి లబోదిబోమంటూ బోరున విలపించారు.

జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం మూలాలను వాడుకొని హైడ్రా ఏర్పడింది. నిజానికి వరదలు, తుఫాన్లు లాంటి ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను ఆదుకొనే సాహస వీరుల దళమిది. ఆ చట్టం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పరిధిని విస్తృతపరిచి నగరంలో అకస్మాత్తు వైపరీత్యాలను సృష్టించే అధికారాలను దానికి కట్టబెట్టింది. అయితే పుట్టగానే పరుగులు పెట్టినట్లు అది రోజూ నగర పరిధిలోని భవంతులను నేలమట్టం చేస్తున్నది. జీహెచ్ఎంసీ ఆధీనంలో పనిచేసే ఈ సంస్థకు రాష్ట్రంలోని వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుచ్ఛక్తి, పోలీస్ విభాగాలు సైన్యంగా తోడుంటున్నాయి. ఆక్రమణదారును ఈ విభాగాలన్నీ కలిసి కదలకుండా చేస్తున్నాయి.

హైడ్రాకు చైర్మన్ సీఎం కాగా.. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. జీవో 99 ద్వారా ప్రభుత్వం ఒక స్వయంప్రతిపత్తి సంస్థగా హైడ్రాకు ఇచ్చిన విస్తృత అధికారాల మూలంగా 'ఈ కూల్చివేతలు ఆగవు, వెనక్కి తగ్గేది లేదు, ఎవరున్నా వదిలేది లేదు' అని దాని కమిషనర్ రంగనాథ్ తెగేసి చెప్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చిన మున్సిపల్, ఇతర విభాగాల అధికారులపై కూడా చర్యలుంటాయని ఆయన కరాఖండిగా చెప్తున్నారు. ఇప్పటికే ఇరవై చెరువుల పరిధిలోని వంద ఎకరాల ప్రభుత్వ భూముల్లో ఉన్న చట్ట విరుద్ధమైన నిర్మాణాలను కూల్చివేశామని హైడ్రా ప్రకటించింది. ఈ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తమ ప్రాంతంలోని చెరువులు, పార్కులకు ఆక్రమార్కుల చెర నుంచి విముక్తి లభిస్తున్నందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కూల్చివేతల్లో రెండు రకాల నిర్మాణాలున్నాయి. ప్రభుత్వ భూములను కబ్జా చేసి కట్టిన భవంతులు మొదటి రకానికి చెందినవి. శాస్త్రిపురం చెరువు వద్ద కూల్చివేసిన భవంతి అలాంటిదే. జీహెచ్ఎంసీ అనుమతులతో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు రెండో రకానివి. నిజాంపేట్‌లోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని కూల్చివేసిన మూడు భవంతులు ఈ కోవకు చెందినవే. పక్కాగా అధికారుల అనుమతులతో నిర్మిస్తున్నందువల్ల ఎందరో వాటిలో ఫ్లాట్‌లు కొనుక్కొని ఉంటారు. మొదటి రకం నిర్మాణాల కూల్చివేతల వల్ల నష్టపోయేది కబ్జాదారుడే. కానీ, రెండో రకం అలా కాదు. వాటిని కూల్చివేస్తే సాధారణ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఇలాంటి భవంతుల కూల్చివేతల వల్ల బిల్డర్‌కు పోయేదేం లేదు. అందుకే ఈ వ్యత్యాసాన్ని గుర్తించి కూల్చివేతల ప్రాధాన్యాన్ని నిర్ణయించుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

అక్రమ వెంచర్లకు అనుమతులిచ్చిన అధికారులపై కూడా చర్యలుంటాయని హైడ్రా బాస్ రంగనాథ్ అంటున్నారు. కూల్చివేతలతో పాటే ఆ పని కూడా మొదలుపెడితే ప్రజలు సంతోషిస్తారు. వాస్తవానికి చట్టాలను జీహెచ్ఎంసీ సరిగ్గా అమలుచేస్తే ఇలాంటి నిర్మాణాలే ఉండవు. ఎప్పటికప్పుడు నగరంలోని కట్టడాలను పర్యవేక్షిస్తే అనుమతులు లేని పనులేవీ సాగవు. కోట్లాది రూపాయల నిర